
ఎలిగేడు మండలం లాలపల్లిలో గండి పడిన కొప్పురవారి కుంట

వర్షాలతో అతలాకుతలం

కొప్పరవాని కుంటకు గండి..

- శ్రీపాద ఎల్లంపల్లికి పోటెత్తిన వరద నీరు
- గోదావరిఖని పుష్కర ఘాటులో కొట్టుకుపోయిన బోట్లు
- లాలపల్లి కొప్పరవారికుంటకు గండి
- మంథనిని సందర్శించిన కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రెండు రోజుల నుంచి జిల్లాలో కురుస్తున్న వర్షాలతో వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. ఆదివారం ఉదయం నుంచి సోమవారం ఉదయం వరకు జిల్లా వ్యాప్తంగా 59.1 మిల్లీ మీటర్ల సగటు వర్షపాతం నమోదయ్యింది. అత్యధికంగా ఎలిగేడు మండలంలో 103.5 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదయ్యింది. అలాగే సుల్తానాబాద్ మండలంలో 81.0 మిల్లీ మీటర్లు, జూలపల్లి మండలంలో 80.8 మిల్లీమీటర్లు, పెద్దపల్లి మంలంలో 75.7 మిల్లీమీటర్లు, కాల్వశ్రీరాంపూర్ మండలంలో 68.1 మిల్లీమీటర్లు, ధర్మారం మండలంలో 62.1 మిల్లీమీటర్లు, కమాన్‌పూర్ మండలంలో 59.6 మిల్లీమీటర్లు, అంతర్గాం మండలంలో 58.0 మిల్లీ మీటర్లు, ఓదెల మండలంలో 53.5 మిల్లీమీటర్లు, పాలకుర్తి మండలంలో 46.9 మిల్లీమీటర్లు, రామగిరి మండలంలో 40.2 మిల్లీమీటర్లు, మంథని మండలంలో 40.9 మిల్లీ మీటర్లు, రామగుండం మండలంలో 34.9 మిల్లీమీటర్లు, ముత్తారం మండలంలో 23.0 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. దీంతో మానేరు వాగు, హుస్సేనిమియా వాగు ఉప్పొంగుతున్నది. చెరువులు, కుంటలు నిండి మత్తడులు దుముకుతున్నాయి. ఎలిగేడు మండలం లాలపల్లి గ్రామంలో గల కొప్పరవాని కుంటకు గండి పడడంతో దాని కింద గల వరి పొలాలు నీట మునిగాయి. జూలపల్లి మండలం వడుకాపూర్ రోడ్ డ్యామ్‌పై నుంచి హుస్సేనిమియా వాగు పారుతుండడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఆదివారం కాల్వశ్రీరాంపూర్ మండలం కూనారం గ్రామ శివారులో గల పెద్ద చెరువులో గల్లంతయిన మత్స్యకారుడు గోస్కుల కుమార్ (45) మృతదేహాన్ని పోలీసులు చెరువు నుంచి బయటకు తీశారు. వర్షాలకు జిల్లాలో పలుగ్రామాల్లో వరి, పత్తి పంట నీట మునిగింది. జిల్లా వ్యవసాయ శాఖాధికారి దోమ ఆదిరెడ్డి, మండల వ్యవసాయ శాఖాధికారులు పలు ప్రాంతాలను సందర్శించి నీట మునిగిన పంటలను పరిశీలించారు.

● శ్రీపాద ఎల్లంపల్లికి పోటెత్తిన వరద..

జిల్లాలోని శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి వరద నీరు పోటెత్తింది. క్యాచ్‌మెంట్ ఏరియాలో కురిసిన వర్షాలతో పాటు, కడెం ప్రాజెక్టు, శ్రీరాంసాగర్ ప్రాజెక్టు గేట్లు ఎత్తి నీటిని గోదావరిలోకి వదిలి పెడుతున్నారు. సోమవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం వరకు ప్రాజెక్టులోకి 5 లక్షలకు పైగా వరద నీరు వచ్చింది. ముందస్తుగా నీటి పారుదల శాఖ అధికారులు ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టానికి 4 నుంచి 6 టీఎంసీలకు లోపు నీటి మట్టం ఉండే విధంగా, వస్తున్న వరద నీటి కంటే అధికంగా నీటిని వదిలి పెట్టారు. మధ్యాహ్నం వరకు 6 లక్షల 58 వేల క్యూసెక్కుల నీటిని 32 గేట్ల ద్వారా వదిలి పెట్టారు. దీంతో గోదావరి 2,92,815 క్యూసెక్కుల వరద నీరు వస్తున్నది. 2,64,787 క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదులుతున్నారు. ఉదయం ఆరు లక్షల క్యూసెక్కుల నీటిని వదిలిపెట్టడంతో గోదావరిఖని వద్ద పుష్కర ఘాట్ దాటి వరద ప్రవహించడంతో అక్కడ ఉన్న ఇంజన్ బోట్లు, మత్స్యకారుల బోట్లు కొట్టుకుపోయాయి. మంథనిలో కూడా పుష్కర ఘాట్ల తాకి వరద నీరు ప్రవహించడంతో అధికారులు ప్రజలను అప్రమత్తం చేశారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మంథని పుష్కర ఘాట్‌ను సందర్శించి గోదావరికి వస్తున్న వరద పరిస్థితిని అంచనా వేసి పలు సూచనలు చేశారు.



ఎలిగేడు: మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షానికి జన జీవనం అతలాకుతలం అయ్యింది. మండలంలోని 12గ్రామాల్లో ఉన్న 44చెరువులు, కుంటలు జలకళను సంతరించుకున్నాయి. లాలపల్లిలోని కొప్పరవాని కుంటకు గండి పడి పంట పొలాలు నీట మునిగాయి. నర్సాపూర్‌లోని పెరుమాళ్ల చెరువు తూము పక్కల పెద్ద బొంగ పడి ప్రమాదంలో పడింది. చెరువులను తహసీల్దార్ స్వర్ణ పరిశీలించారు. నారాయణపూర్, ఎలిగేడులోని వివిధ ప్రాంతాల్లోని కాలనీల్లోకి వరదనీరు వచ్చి చేరింది. వివిధ గ్రామాల్లోని అంతర్గత, బహిర్గత రోడ్లు బురదమయమయ్యాయి. తుఫాన్ తీవ్రతను బట్టి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ స్వర్ణ, ఎంపీడీవో భాస్కర్‌రావు పేర్కొన్నారు.


వడుకాపూర్ రోడ్ డ్యాంపై నుంచి వెళుతున్న వరద నీరు


గోదావరి వరదలో కొట్టుకుపోతున్న బోటు


కొత్తపల్లి వెళ్లే దారిలో ప్రవహిస్తున్న వరదనీరు

● ఉప్పొంగిన గోదావరి, మానేరు నదులు

- లోతట్టు ప్రాంతాల ప్రజలు, అధికారులు అప్రమత్తం

మంథని: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా మంథని డివిజన్‌లో గోదావరి, మానేరు నదులు, వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. వర్షాలకు తోడు పైనుంచి వస్తున్న వరదనీటితో నిండుగా ఉరకలేస్తున్నాయి. ఆది, సోమవారాల్లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ, మోస్తారు వర్షాలతో డివిజన్‌లోని మంథని, ముత్తారం, రామగిరి, కమాన్‌పూర్ మండలాల్లో గోదావరి, మానేరు నదులు, వాగులు చెరువులు, కుంటలు నిండుకున్నాయి. దీంతో వివిధ మండలాల్లోని గోపాల్‌పూర్, చిన్నఓదాల, పోతారం, విలోచవరం, ఉప్పట్ల, ఖాన్‌సాయిపేట, ఖానాపూర్, సిరిపురం, గుంజపడుగు, ఖానాపూర్, అడవిసోమన్‌పల్లి, పొలాల్లోకి వరద నీరు వచ్చి చేరింది. దీంతో వరి, పత్తి పంటలకు కొంతమేర నష్టం వాట్లింది. సింగరేణి సంస్థ ఆర్జీ-3 డివిజన్‌లోని పలు మైన్స్‌లో బొగ్గు ఉత్తత్పతికి విఘాతం కలిగింది. గోదావరినది పైభాగంలో ఉన్న ఎస్సారెస్పీ, కడెం, ఎల్లంపల్లి ప్రాజెక్టుల నుంచి అధికారులు దిగువకు నీటిని విడుదల చేస్తుండటంతో మంథని, ముత్తారం, రామగిరి మండాల్లోని గోదావరి, మానేరు నదుల పరివాహక ప్రాంతాల్లోని లోతట్టు ప్రాంతాల్లోని గ్రామాల ప్రజలను, రైతులను, పశువుల కాపరులను, మత్స్యకారులను అధికారులు అప్రమత్తం చేశారు. ఇందులో భాగంగానే కలెక్టర్ కోయ శ్రీహర్ష, అదనపు కలెక్టర్ అరుణ శ్రీ, ఆర్డీవో హనుమానాయక్, మంథని మున్సిపల్ చైర్‌పర్సన్ పెండ్రి రమ-సురేష్‌రెడ్డి మంథని తీరంలో గోదావరినదిలో వరద ఉధృతిని పరిశీలించారు.


మంథని తీరంలో ఉధృతంగా ప్రహిస్తున్న గోదావరినది

● కలవరపెట్టిన గోదావరి వరద..

- గోదావరి సమ్మక్క గద్దెల ముందుకు నీరు

- పోలీస్, మున్సిపల్ కార్పొరేషన్ యంత్రాంగం అప్రమత్తం

కోల్‌సిటీ: శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టుకు ఎగువ నుంచి భారీగా వరద నీరు వస్తుండడంతో ఆదివారం రాత్రి ప్రాజెక్టు నుంచి నీటి విడుదలను పెంచారు. ఉదయం 11గంటలకు 6.5లక్షల క్యూసెక్కుల నీటిని వదిలారు. వరద ప్రవాహాన్ని భట్టి 7లక్షల నుంచి 10లక్షల క్యూసెక్కుల వరకు నీటిని విడుదల చేస్తామని ప్రాజెక్టు అధికారులు పేర్కొన్నారు. మధ్యాహ్నం 1గంట వరకు వరద నీరు గోదావరిఖని గోదావరి తీరాన్ని తాకింది. గోదావరిఖని సమ్మక్క - సారలమ్మ గద్దెల వరకు వరద ప్రవాహం చేరింది. మేడిపల్లి ఓసీపీలోని లారీ యార్డు చుట్టూ వరద నీరు చేరింది. నీటిలో చిక్కుకున్న లారీలను క్రేన్ సహాయంతో బయటకు లాగారు. రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ వరద పరిస్థితిపై పోలీస్, మున్సిపల్ కార్పొరేషన్ యంత్రాంగాలను అప్రమత్తం చేశారు. గోదావరిఖని టుటౌన్ సీఐ ప్రసాద్‌రావు జనగామ, గంగానగర్, మేడిపల్లి ఓసీపీ రోడ్డు ప్రాంతాల్లో ఎప్పటికప్పుడు పరిశీలించారు. సమ్మక్క-సారలమ్మ గద్దెల వద్ద వైపు స్నానాలకు వెళ్లకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు. సాయంత్రానికి 2.65లక్షల క్యూసెక్కులకు వరద ప్రవాహం తగ్గింది. దీంతో పోలీస్, మున్సిపల్ యంత్రాంగాలు ఊపిరి పీల్చుకున్నాయి. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నీరు ఎల్లంపల్లికి చేరితే మళ్లీ వరద ప్రవాహం పెరిగే అవకాశం ఉందని, కానీ క్యాచ్‌మెంట్ ఏరియాల్లో భారీ వర్షాలు లేనందువల్ల వరద ముప్పు ఉండదనే అభిప్రాయంతో ఉన్నారు.


గోదావరిఖని బ్రిడ్జి వద్ద ప్రమాదకరంగా ప్రవహిస్తున్న గోదావరినది

వరద ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలి

- కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వరదల నేపథ్యంలో చెరువులు, కుంటలు ఇతర నీటి వనరుల్లో నీటి నిర్వహణ నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో వరదలు, నీటి వనరుల నిర్వహణపై అదనపు కలెక్టర్లు జే అరుణశ్రీ, జీవీ శ్యామ్ ప్రసాద్‌లాల్‌తో కలిసి సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న నీటిపారుదల రంగం పరిధిలో ఉన్న చెరువులు, కుంటల్లో ప్రస్తుత నీటి నిల్వలు, వస్తున్న వరదను అంచనా వేయాలని సూచించారు. చెరువు కట్టల పటిష్టతను పరీక్షించి అధికారులు నివేదిక సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. చెరువుల్లో నీటి నిల్వలను ఎప్పటికప్పుడు పరిశీలించాలని, మత్తడి దూకే చెరువులు, కుంటల కారణంగా ఎక్కడైనా లోతట్టు ప్రాంతాల ప్రజలు ముంపునకు గురై అవకాశం ఉంటే వెంటనే సదరు ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని కలెక్టర్ సూచించారు. మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఎగువ గోదావరి నుంచి పెద్ద ఎత్తున వరద వస్తుందని, ఎల్లంపల్లి ప్రాజెక్టులు నీటిని నిల్వలను ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ వరద నీటిని దిగువకు విడుదల చేయాలని సూచించారు.

వరద నీరు విడుదల చేస్తున్న సమయంలో కింద మత్స్యకారులు, గొర్రె కాపరులు మొదలగువారు ఉండకుండా చూడాలన్నారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు నిర్వహణకు సంబంధించి సమాచారాన్ని ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేయాలని తెలిపారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని, అవసరమైన పరిస్థితుల్లో సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేయాలని, పునరవాస కేంద్రాలను సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. సమావేశంలో పెద్దపల్లి ఆర్డీవో బి గంగయ్య, డీపీవో ఆశాలత, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.


మంథని గోదావరి తీరంలో పర్యటిస్తున్న కలెక్టర్

● మంథనిలో కలెక్టర్ పర్యటన..

మంథని: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా జిల్లాలోని వరద ముంపు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. మంథని పట్టణ శివారులోని గోదావరినదిలో వరద ఉధృతిని సోమవారం ఆయన అదనపు కలెక్టర్ అరుణశ్రీతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు.

ఎగువన కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఎస్సారెస్పీకి భారీగా వరద నీరు చేరడంతో ప్రాజెక్టు నుంచి గెట్లను ఎత్తి నీటిని విడుదల చేస్తున్నారన్నారు. దీంతో ముంపు ప్రాంతాల ప్రజలకు ఎలాంటి నష్టం కలుగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆకస్మికంగా భారీ వరదలు వచ్చే నేపథ్యం ఉండటంతో అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. మంథని శివారులోని బొక్కలవాగు ఉధృతంగా ప్రవహిస్తున్న కారణంగా వివిధ ప్రాజెక్టుల నుంచి వరద నీటిని దిగువకు విడుదల చేసే అవకాశం ఉండటంతో రెవెన్యూ, పోలీసు, మున్సిపల్, ఐబీ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గ్రామీణ, మున్సిపల్ ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వాహణ, సీజనల్ వ్యాధుల నివారణ చర్యల కోసం ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట ఆర్డీవో హనుమానాయక్, మంథని మున్సిపల్ చైర్‌పర్సన్ పెండ్రి రమ-సురేష్‌రెడ్డి, తహసీల్దార్, వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.

అత్యవసర పరిస్థితుల్లో తప్ప బయటకు రావద్దు

- రామగుండం సీపీ శ్రీనివాస్

కాల్వశ్రీరాంపూర్, సెప్టెంబరు 2: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలపై అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని పోలీస్ కమిషనర్ ఎం శ్రీనివాస్ అన్నారు. ఆదివారం కాల్వశ్రీరాంపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కూనారం గ్రామ చెరువులో జరిగిన మాత్స్యకారుడి గల్లంతు సంఘటన గురించి సీపీ చెరువును సందర్శించి అధి కారులను అడిగి తెలుసుకున్నారు. హుస్సేన్‌మియా వాగు, గుంపుల వద్ద మానేరు వరద ఉధృతిని డ్రోన్ కెమెరా ద్వారా పరిశీలించారు. అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన ముందస్తు భద్రత చర్యలపై అధికారులకు పలు ఆదేశాలు, సూచనలు చేశారు. అదేవిధంగా మీర్జంపేట గ్రామపంచాయతీ కారోబార్ గల్లంతైన కొత్తపల్లి నక్కల వాగు వద్ద జరిగిన ప్రమాద ప్రాంతాన్ని సీపీ సందర్శించి సంఘటన వివరాలు ప్రజలను, అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీవర్షాలపై అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని సీపీ సూచించారు. గుంపుల మానేరు బ్రిడ్జిపై ప్రమాదకరంగా ఉన్న సైడ్ సేఫ్టీ వాల్‌ను మరమ్మతు చేయించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ప్రజలు ఎవరు కూడా అత్యవసర పరిస్థితుల్లో తప్ప బయటకు రావద్దని, ప్రయాణాలు చేయకూడదని సూచించారు. వరదల వలన ఇబ్బంది ఏర్పడిన సమయంలో రక్షణ చర్యలు చేపట్టేందుకు వెంటనే స్పందించి ప్రాణ నష్టం, ఆస్తి నష్టం జరగకుండా కాపాడడం కోసం శిక్షణ పొందిన సిబ్బందితో పాటు ఒక వాటర్ బోటు, వివిధ రక్షణ పరికరాల ద్వారా కూడిన డీడీఆర్ఎఫ్ (డిస్టిక్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్) పోలీసు టీంను అందుబాటులో ఉంచామన్నారు. నీటి ప్రవాహం ఉన్న వంతెనలు, రోడ్ల వద్ద రాకపోకలు నిలిపి వేయాలని ఆదేశించారు. అన్ని శాఖల అధికారుల సమన్వయంతో జిల్లా పోలీసులు ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఏవైనా సమస్యలు తలెత్తితే వెంటనే పోలీస్ కంట్రోల్ రూం నంబర్ 81712656597, లేదా డయల్ 100కు ఫోన్ చేయాలని సూచించారు. పెద్దపల్లి డీసీపీ చేతన, అడిషనల్ డీసీపీ (అడ్మిన్) సీ రాజు, పెద్దపల్లి ఏసీపీ జీ కృష్ణ, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్రరావు, సుల్తానాబాద్ సీఐ సుబ్బారెడ్డి, పెద్దపల్లి సీఐ ప్రవీణ్‌కుమార్, కాల్వశ్రీరాంపూర్, పోత్కపల్లి ఎస్‌ఐలు వెంకటేశ్, అశోక్‌రెడ్డి ఉన్నారు.


కొత్తపల్లిలో కాజ్‌వేను పరిశీలిస్తున్న సీపీ శ్రీనివాస్

● ప్రజలు అప్రమత్తంగా ఉండాలి..

సుల్తానాబాద్: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో వాగులు వంకలు పొంగి పొర్లుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ శ్రావణ్ కుమార్ సూచించారు. ఎస్‌ఐ తన సిబ్బందితో కలసి ఆయా గ్రామాల్లో పర్యటించారు. యువతను చేరదీసి సహాయక చర్యలు చేపట్టాలని సూచించారు. కొదురుపాక నుంచి దేవునిపల్లి వెళ్లే వంతెన నీట మునగగా బ్రిడ్జి వద్ద పరిస్థితిని పర్యవేక్షించారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.


పెద్దపల్లి రూరల్: మండలంలోని అప్పన్నపేట చెరువును బసంత్‌నగర్ ఎస్‌ఐ ఆర్ స్వామి పరిశీలించారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల దృష్ట్యా ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. మత్స్యకారులు చెరువుల్లో చేపల వేటకు వెళ్లొద్దని సూచించారు. వారి వెంట పోలీస్ సిబ్బంది ఉన్నారు.




రూ.53 లక్షలకు ఇసుక వేలం

జమ్మికుంట రూరల్, సెప్టెంబర్ 2: జమ్మికుంట మండలం శంభునపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని పరిమల కాలనీలో అక్రమంగా నిల్వ ఉంచిన 1500 ట్రాక్టర్ ట్రిప్పుల ఇసుకను అదే గ్రామానికి చెందిన ఎస్ రమేష్ అనే వ్యక్తి బహిరంగ వేలం ద్వారా రూ.53లక్షలకు సోమవారం దక్కించుకున్నాడు. వేలంలో రెవెన్యూశాఖ అధికారులు పాల్గొన్నారు.







గొల్ల, కురుమలకు సబ్సిడీ రుణాలు అందజేయాలి


మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము అశోక్‌యాదవ్

భగత్‌నగర్, సెప్టెంబరు 2: ప్రభుత్వం గొల్ల, కురుమలకు 75 శాతం సబ్సిడీతో రుణాలు మంజూరు చేయాలని గొర్రెల మేకల పెంపకం వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కొమ్ము అశోక్‌యాదవ్ అన్నారు. సోమవారం నగరంలోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న గొర్రెకాపరుల సహకార సంఘ సొసైటీ ఎన్నికల్లో ఉత్సాహంగా పనిచేయలన్నారు. స్వర్గీయ కాలువ నర్సన్న యాదవ్ ఆశయ సాధన కోసం పనిచేయాలన్నారు. ప్రమాదవశాత్తు పిడుగుపాటు, పాముకాటుతో చనిపోయిన వారికి పది లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలన్నారు. గొర్రెల కాపరులకు ఫారెస్ట్ అధికారుల వేధింపులు అరికట్టాలన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు కటిక రెడ్డి బుచ్చన్నయాదవ్, రాష్ట్ర కార్యదర్శి కదారి ఐలయ్య, చిగుర్లశ్రీనివాస్, నందనవేని ప్రసాద్, జంగం కొమురన్న, గూడెం శ్రీనివాస్ రాజు, దాడి రాజబాబు, గంగంలింగయ్య, రాధారపు కుమార్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

వర్షాలతో నష్టపోయిన వారిని ఆదుకోవాలి

భగత్‌నగర్, సెప్టెంబరు 2: భారీ వర్షాలతో నష్టపోయిన వారిని ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం కరీంనగర్‌లోని ముకుందలాల్ మిశ్రాభవన్‌లో ఆయన మాట్లాడుతూ వర్షాల కారణంగా అనేక గ్రామాలకు రాకపోకలు స్తంభించి పోయాయన్నారు. చోట్ల లోతట్టు ప్రాంతాలు జలమయమై కాలనీలు నీట మునిగాయన్నారు. ఇసుక మేటలతో పంట పొలాలు దెబ్బతిన్నాయన్నారు.ఇళ్లు కూలిపోయిన వారిని వెంటనే ఆదుకోవాలన్నారు. కరీంనగర్‌లో హైడ్రా తరహాలో సంస్థను ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా కమిటీ సభ్యుడు నరేష్‌పటేల్, నాయకులు పున్నం రవి, చెలకాని శ్రీనివాస్, ఎంప్రశాంత్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మిల్కూరి వాసుదేవరెడ్డి



విజేతగా నిలిచిన రామగుండం ఎన్టీపీసీ జట్టుకు ట్రోఫీ అందిస్తున్న అధికారులు

బ్యాడ్మింటన్ విజేత
రామగుండం ఎన్టీపీసీ జట్టు

జ్యోతినగర్, సెప్టెంబరు 2 : కర్నాటకలోని కుడిగి ఎన్టీపీసీలో జరిగిన ఇంటర్ రీజినల్ స్పోర్ట్స్ మీట్ 2024లో రామగుండం ప్రాజెక్టు జట్టు బ్యాడ్మింటన్‌లో విజేతగా నిలిచింది. సోమవారం జరిగిన ఫైనల్స్‌లో రామగుండం ఎన్టీపీసీ ఆటగాళ్లు సింగిల్స్, డబుల్స్‌లో విజయం సాధించి ఛాంపియన్‌గా నిలిచారు. హరీష్‌కుమార్ నాయకత్వంలోని రామగుండం ఎన్టీపీసీ జట్టు సభ్యులు రాంబాబు, రాజేశ్, శోభన్‌బాబు, సోహన్ సింగ్, వీరబాబు, టీం మేనేజర్ జి.భానేశ్వర్, కోఆర్డినేటర్ లను ఎన్టీపీసీ ఈడీ కేదార్ రంజన్ పాడు అభినందించారు.







ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు..

ప్రాజెక్టు	ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	ఔట్ ఫ్లో (క్యూసెక్కుల్లో)	పూర్తి సామర్థ్యం (టీఎంసీల్లో)	ప్రస్తుత నిల్వ (టీఎంసీల్లో)
శ్రీరాంసాగర్	2,51,250	3,30,781	80.5	73.00
ఎల్లంపల్లి	2,78,326	4.02.023	20.175	14.181
మిడ్ మానేరు	46,272	6.400	27.54	19.55
ఎల్ఎండీ	9.718	273	24.034	15.788
ఎగువమానేరు	27,500	------	2.00	2.00

తెరుచుకున్న శ్రీరాంసాగర్ ప్రాజెక్టు గేట్లు

- 40 గేట్లు ఎత్తి దిగువకు 2 లక్షల క్యూసెక్కుల నీరు
- వరద కాలువకు 7 వేల క్యూసెక్కులు
- ప్రాజెక్టులోకి 2.51 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

జగిత్యాల, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి సోమవారం భారీగా వరద రావడంతో 40 గేట్లు ఎత్తారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఇన్‌ఫ్లో భారీగా కొనసాగింది. దీంతో ప్రాజెక్టుకు చెందిన గేట్లను విడతల వారీగా ఎత్తి 2 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. వరద కాలువకు సైతం 7 వేల క్యూసెక్కుల నీటిని వదిలారు. ప్రాజెక్టులోకి 2,51,250 క్యూసెక్కుల ఇన్‌స్టంట్ ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులో ప్రస్తుతం 73 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టు నుం చి 40 గేట్లు ఎత్తి 2 లక్షల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదులుతుండగా, కాకతీయ కాలువకు 3 వేల క్యూసెక్కులు, వరద కాలువకు 5 వేల క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కుల నీటిని వదిలారు.


ఉదయం 6 గంటలకు వరద కాలువకు 1,500 క్యూసెక్కులు విడుదల చేయగా, 7 గంటలకు ఇన్‌ఫ్లో ఎప్పటికప్పుడు పెరుగుతుండడంతో 3 వేల క్యూసెక్కులు, 10 గంటల నుంచి 5 వేల క్యూసెక్కులకు, సాయంత్రం 4 గంటలకు 7వేల క్యూసెక్కులకు పెంచారు. గోదావరి తీర ప్రాంత ప్రజలు, లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎస్సారెస్పీ, రెవెన్యూ అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

ధర్మపురి, కోటిలింగాల వద్ద ఉధృతంగా గోదావరి

ధర్మపురి: ధర్మపురి వద్ద గోదావరి నది వరద సోమవారం సాయంత్రం ఉధృతంగా ఉంది. ఎగువ ప్రాంతాల్లో కురి సిన భారీ వర్షాలకు అనేక గ్రామాల్లో వాగులు, చెరువులు, కుంటలు నిండి పోయాయి. కడెం ప్రాజెక్టు గేట్లు తెరచి గోదావరిలోకి విడుదల చేశారు. దీంతో గోదావరి నీటి మట్టం క్షణ క్షణం పెరిగి వేగంగా ప్రవాహం కొనసాగింది. సత్యవతి, బ్రహ్మగుండం పైనుంచి వేగంగా నీటి ప్రవాహం కొనసాగడం వల్ల సంతోషిమాత, మంగళిగడ్డ, సోమవిహార్ స్నానఘట్టాలు నీటిలో మునిగి పోయాయి. భక్తులను లోతు ప్రదేశాలకు వెళ్లి స్నానాలు చేయకుండా ఆలయ సిబ్బంది మైకుల ద్వారా ప్రచారం చేసి అప్రమత్తం చేశారు. అలాగే నదీ తీరాన గల పలు గ్రామాలకు చెందిన ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు.



ధర్మపురి వద్ద గోదావరి ఉధృతి



ఎస్సారెస్పీ వద్ద గేట్ల ద్వారా దిగువకు వెళ్తున్న నీరు

● వెల్గటూర్: కోటిలింగాల వద్ద సోమవారం వరద ఉధృతి పెరిగింది. స్నాన ఘట్టాలపైకి నీరు చేరింది. తహసీల్దార్ శేఖర్, సీఐ రాంనర్సింహారెడ్డి, ఎస్సై ఉమా సాగర్‌లు ఎప్పటికప్పుడు పరిస్థితిని అంచనా వేస్తూ లోతట్టు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేశారు. కోటిలింగాల, చెగ్యాం వద్ద గోదావరి పరివాహక ప్రాంతాలలో పర్యటించి, ప్రజలు గోదావరిలోకి వెళ్ల వద్దని హెచ్చరించారు. చేపలు పట్టే వారు చేపల వేటకు వెళ్లవద్దని, పశువుల కాపర్లు గోదావరిలోకి వెళ్లవద్దని హెచ్చరించారు.

ఎల్లంపల్లి నుంచి భారీగా నీటి విడుదల

అంతర్గాం : అంతర్గాం మండల పరిధిలోని ఎల్లంపల్లి గ్రామ శివారులో గల శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు 32గేట్లు ఎత్తి సోమవారం గోదావరిలోకి నీటిని విడుదల చేస్తున్నట్లు ఎల్లంపల్లి అధికారులు తెలిపారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ప్రాజెక్టులోకి ఎగువన గల కడెం ప్రాజెక్టు నుంచి 40,250 క్యూసెక్కులు, వాగులు, కుంట ల ద్వారా మొత్తం 2,78,326 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో ఎల్లంపల్లి అధికారులు 32 గేట్లను ఎత్తి 4,02,023క్యూసెక్కుల నీటిని దిగువన గల గోదావరిలోకి వదులుతున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 20.175టీఎంసీలకు ప్రస్తుతం ప్రాజెక్టులోకి 14.181 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టులోకి ఇంకా వరద ఉధృతి కొనసాగుతుండగా అధికా రులు మరిన్ని గేట్లు ఎత్తే అవకాశం ఉన్నది. గేట్లు ఎత్తడంతో గోదావరి తీర ప్రాంతగ్రామాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేస్తున్నారు.

గాయత్రీ పంప్‌హౌస్ నుంచి నీటి విడుదల నిలిపివేత

● ప్రారంభం నుంచి 205 టీఎంసీల నీరు ఎత్తిపోత

రామడుగు: మండలంలోని లక్ష్మీపూర్ గాయత్రీ పంప్‌హౌస్ నుంచి శ్రీ రాజరాజేశ్వర మిడ్ మానేరు జలాశయానికి నీటి విడుదలను కొనసాగించిన అధికారులు సోమవారం నిలిపివేశారు. నెలరోజులుగా ఇక్కడి నుంచి మిడ్ మానేరుకు 24.2 టీఎంసీల నీటిని రిజర్వ్ చేశారు. ప్రస్తుతం భారీ వర్షాలు కురుస్తుండటంతో పాటు అన్ని జలాశయాలలో నీరు ఉండటంతో నీటి విడుదలను ఆపివేసినట్లు అధికారులు చెబుతున్నారు. గాయత్రీ పంప్‌హౌస్ ప్రారంభమైనప్పటి నుంచి నేటి వరకు 205 టీఎంసీల నీటిని విడుదల చేశారు. ఒక్కో టీఎంసీతో పది వేల ఎకరాల ఆయకట్టుకు నీరు అందుతుండగా మొత్తం 20లక్షల50 వేల ఎకరాలకు సాగు నీరు అందించినట్లు అయింది.



ఎల్ఎండీ ప్రాజెక్టులో నీరు

మిడ్ మానేరుకు భారీగా వరద

బోయినపల్లి: శ్రీరాజరాజేశ్వర (మిడ్ మానేరు) ప్రాజెక్టులోకి ఎగువ భాగాన కురిసిన వర్షాలతో మానేరు, మూల వాగు ద్వారా భారీగా వరద నీరు వచ్చి చేరుతుండడంతో ప్రాజెక్టులో నీటి నిల్వ గణనీయంగా పెరుగుతోంది. ప్రాజెక్టులోకి 46,272 క్యూసెక్కుల నీరు వస్తుండగా, ఇందులో మానేరు, మూలవాగు, వరద కాలువ క్యాచ్‌మెంట్ల ద్వారా 41,271 ఎస్సారెస్పీ నుంచి 5 వేల క్యూసెక్కుల ఇన్ ఫ్లో వచ్చి చేరుతోంది. గాయత్రీ పంప్‌హౌస్ నుంచి ఎత్తిపోతలను నిలిపివేశారు. అన్నపూర్ణ రిజర్వాయర్‌కు 6,400 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు. ప్రాజెక్టు ఎగువ భాగాన కురిసిన భారీ వర్షాలకు ఆదివారం సాయంత్రం వరకు 15.30 టీఎంసీల మేరకు నీరు నిల్వ ఉండగా సోమవారం 19.55 టిఎంసిలకు చేరుకుంది.

పెరుగుతున్న ఎల్ఎండి నీటి మట్టం

తిమ్మాపూర్: రెండు, మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు కరీంనగర్ పరిధిలోని దిగువ మానేరు జలాశయంలోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. ఆదివారం ఉధృతంగా ప్రవహించిన మోయతుమ్మెద వాగు సోమవారం వర్షం తగ్గుముఖం పట్టడంతో ఉధృతి కూడా తగ్గింది. ఎల్ఎండిలో ప్రస్తుతానికి 24.034 టీఎంసీలకు 15.754టిఎంసిల నీరు నిల్వ ఉండగా, మోయతుమ్మెద వాగు ద్వారా 7,887క్యూసెక్కులు, ఎగువ ఎల్ఎండి నుండి 1,831క్యూసెక్కులు మొత్తం 9,718 క్యూసెక్కుల నీరు ఎల్ఎండిలోకి ఇన్‌ఫ్లోలు వస్తుండగా 273క్యూసెక్కుల నీరు అవుట్ ఫ్లో వెలుతున్నట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు. భారీ వర్షాలు కురుస్తుండటంతో ఇరిగేషన్ అధికారులు ఎల్ఎండీ వద్ద ఉండి పర్యవేక్షిస్తున్నారు.

ఉప్పొంగుతున్న మానేరు

గంభీరావుపేట: గంభీరావుపేట మండలం నర్మాల ఎగువ మానేరు పరవళ్లుతొక్కుతూ పోటెత్తుతోంది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు సిద్దిపేట జిల్లాలోని కూడవెల్లి వాగు, కామారెడ్డి జిల్లాలోని పాల్వంచ వాగు పోటెత్తి ఉధృతంగా ప్రవహిస్తుంటంతో మానేరులోకి వరద నీరు భారీగా వస్తోంది. దీంతో అధికారులు మానేరు వాగు పరివాహక ప్రాంతాల్లోని గ్రామాల ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నారు. రైతులు, మత్స్యకారులు అటువైపు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకుం టున్నారు.

వసూళ్లకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్ట్

కోరుట్ల, సెప్టెంబరు 2 : కోరుట్ల పట్టణానికి చెందిన రియల్టర్‌ను బెదిరించి డబ్బుల వసూళ్లకు పాల్పడ్డ అయిలాపూర్ గ్రామానికి చెందిన సుందరిగిరి లక్ష్మీనర్సయ్యగా అనే వ్యక్తిని కోరుట్ల పోలీసులు అరెస్టు చేసినట్లు సీఐ సురేష్ బాబు తెలిపారు. సోమవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో అరెస్టు వివరాలను ఎస్ఐ శ్రీకాంత్‌తో కలిసి వెల్లడించాడు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలో ఉంటున్న దాసరి రాజశేఖర్ అలియాస్ టీవీ శేఖర్ అనే రియల్ ఎస్టేట్ వ్యాపారికి లక్ష్మీనర్సయ్య ఫోన్ చేసి మొదట కోటి రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. కొద్ది రోజులకు ప్రకాశం రోడ్డులోని రాజశేఖర్ టీవీ సర్వీసింగ్ సెంటర్‌కు వచ్చిన సదరు వ్యక్తి రూ. 10లక్షలు ఇవ్వాలని లేకుంటే చంపుతానని బెదిరించాడు. దీంతో వెంటనే రాజశేఖర్ పోలీసులకు సమాచారం అందించాడు. ఈ మేరకు ఎస్ఐ శ్రీకాంత్ తన సిబ్బందితో ఆ ప్రాంతంలో నిఘా ఉంచాడు. ఆదివారం సాయంత్రం మరో మారు రాజశేఖర్ వద్దకు సదురు వ్యక్తి వచ్చిన విషయం తెలుసుకున్న ఎస్ఐ శ్రీకాంత్ తన సిబ్బందితో అక్కడి చేరుకుని మాటు వేసి పట్టుకున్నారు. ఆ వ్యక్తిని పోలీసు స్టేషన్‌కు తరలించి విచారణ చేపట్టారు. అతని వద్ద సెల్ ఫోన్, ద్విచక్ర వాహనం, కత్తి స్వాధీనం చేసుకున్నారు. రాజశేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. ఎస్ఐ శ్రీకాంత్, కానిస్టేబుళ్లు ఎల్లయ్య, పురిషోత్తం, శ్రీనివాస్‌లను సీఐ అభినందించారు.

గల్లంతైన మత్స్యకారుడి మృతదేహం లభ్యం

కాల్వశ్రీరాంపూర్, సెప్టెంబరు 2: పెద్దపల్లి జిల్లా కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని కూనారం గ్రామ శివారులోని పెద్ద చెరువులో చేపలు బయటకు వెళ్లకుండా వలలు కట్టడానికి వెళ్లి గోస్కుల కుమార్(45) ఆదివారం గల్లంతయ్యాడు. గాలింపు చర్యలో సోమవారం మృతదేహం లభ్యమైంది. మృతిచెందిన కుమార్ కరీంనగర్ జిల్లా వీణవంక మండలం బేతిగల్ గ్రామ వాసి. చెరువులో నుంచి చాపలు బయటికి వెళ్లకుండా ముత్తడి వద్ద వలలు కట్టడానికి గోస్కుల కుమార్, కలవేన మొగిలి, సాగర్ల తిరుపతి, చేతి నరసయ్య వెళ్లగా వరద ప్రవాహానికి గోస్కుల కుమార్ గల్లంతయ్యాడు. పెద్దపల్లి ఏసీపీ జి కృష్ణ సంఘటన స్థలానికి చేరుకొని పోలీసులను మత్స్య కార్మికులను రెస్క్యూ టీం సభ్యులను అప్రమత్తం చేశారు. ఉదయం నుంచే చెరువులో గాలింపు చేపట్టగా కుమార్ మృతదేహం లభ్యమైంది. కుమార్ మృతదేహాన్ని చూసిన కుటుంబ సభ్యులు బోరున విలపించారు. బతుకుదెరువు కోసం వచ్చి ప్రాణాలు కోల్పోవడంతో అటు మృతుడి గ్రామం ఇటు కునారంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

ఏసీపీ వెంట సుల్తానాబాద్ సీఐ సుబ్బారెడ్డి, ఎస్ఐ వెంకటేష్, ఇన్‌చార్జి తహసీల్దార్ శంకర్, ఎంపీడీవో రామ్మోహన్‌చారి, ఎంపీవో గోవర్దన్, పోలీసులు అధికారులు ఉన్నారు.

చికిత్స పొందుతూ ట్రాన్స్‌కో ఫోర్‌మన్ మృతి

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 2: ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ట్రాన్స్‌కో ఫోర్‌మన్ అజ్మీర సారయ్య(53) సోమవారం మృతి చెందాడని రెండో టౌన్ పోలీసులు తెలిపారు. కరీంనగర్ భాగ్యనగర్‌లో నివాసం ఉంటున్న అజ్మీర సారయ్య కరీంనగర్ టౌన్-5 టవర్‌సర్కిల్ ప్రాంతంలో ఫోర్‌మన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఆగస్టు 30న రాత్రి విధులు ముగించుకుని ఇంటికి బైక్‌పై వెళుతుండగా భాగ్యనగర్ అప్పాబజార్ కిరాణంషాపు చౌరస్తా వద్ద గణేష్ మండపం ఏర్పాటు కోసం రోడ్డుపై నిర్లక్ష్యంగా వదిలిన భారీ ఇనుప బల్లలను బైక్ ఢీకొట్టింది. దీంతో కిందపడిన అజ్మీర్ సారయ్య కాలు, ముఖం, నడుం భాగంలో తీవ్ర గాయాలయ్యాయి. ఆసుపత్రిలో చేర్పించి చికిత్స చేయిస్తుండగా సోమవారం మృతి చెందాడని పోలీసులు తెలిపారు. గణేష్ మండపాల నిర్వాహకులు నిర్లక్ష్యంగా భారీ ఇనుప బల్లలను రోడ్డుపై వదలిన కారణంగా తన తండ్రి ప్రమాదానికి గురై మరణించాడని, వారిపై చర్యలు తీసుకోవాలని మృతుడి కొడుకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

బోవెరాను ఆదర్శంగా తీసుకోవాలి

● సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ

కరీంనగర్ కల్చరల్, సెప్టెంబరు 2: ప్రతి ఒక్కరూ డాక్టర్ బోయినపల్లి వెంకటరామారావు(బోవెరా)ను ఆదర్శంగా తీసుకోవాలని సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ అన్నారు. బోవెరాలా పనిచేసే 360 డిగ్రీల యువ నాయకత్వం సమాజానికి కావాలని ఆయన అన్నారు. సోమవారం కరీంనగర్‌లోని పద్మనాయక కల్యాణ మండపం హాల్-2లో బోవేరా సంస్థల ఆధ్వర్యంలో బోవేరా 104వ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా బోవెరా విగ్రహానికి పూల మాలలు వేశారు. బోవెరా సంస్థల అధ్యక్షుడు బోయినపల్లి హనుమంతరావు స్వాగతోపన్యాసం చేశారు. గద్దర్‌కు మరణానంతరం గద్దర్ కుమారుడు సూర్యకిరణ్ దంపతులకు గాయకుడు, కవి అందెశ్రీతో పాటు ఇతర అతిథుల చేతుల మీదుగా బోవెరా కవితా పురస్కారాన్ని అందజేశారు. ఈసందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ బోవేరా మద్యనిషేధం, గ్రంథాలయోద్యమం, అంటరానితనం నిర్మూలన, వయోజన విద్య, హిందీ భాషా ప్రచారం, భూదాన ఉద్యమాల ద్వారా ప్రజల్ని ప్రభావితం చేశారని అన్నారు. బోవెరా పేరుతో ఆయన స్వగ్రామం తోటపెల్లిలో ఒక కళాక్షేత్రం, స్మారక ఆశ్రమం ఏర్పాటు చేయాలనుకోవడం హనుమంతరావు గొప్పతనానికి నిదర్శనమని అన్నారు.

మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ సమాజం కోసం జీవితాన్నే త్యాగం చేసిన బోవెరా మన గడ్డపై పుట్టడం గర్వకారణమని అన్నారు. అందెశ్రీ మాట్లాడుతూ బోవెరా విగ్రహం ఏర్పాటు చేయాలని అన్నారు. ఎమ్మెల్సీ మధుసూదనాచారి మాట్లాడుతూ తాను ఎంచుకున్న జీవన విధానంలో బోవేరా కృతకృత్యులయ్యారన్నారు. కార్యక్రమంలో విద్యార్థి నాయకుడు పృథ్వీరాజ్ వ్యాఖ్యాత మాడిశెట్టి గోపాల్, పారమిత విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఇనుగంటి ప్రసాదరావు, కవులు, రచయితలు, సాహిత్యాభిమానులు, నగర వాసులు, బోవేరా అభిమానులు, స్వాతంత్ర్య సమరయోధులు పాల్గొన్నారు.



గద్దర్ కుమారుడు సూర్యకిరణ్ దంపతులకు బోవెరా పురస్కారంతో సన్మానం

ప్రమాదవశాత్తు మహిళ మృతి



లక్ష్మి (ఫైల్)

వీర్నపల్లి, సెప్టెంబరు 2 : వీర్నపల్లి మండలం మద్దిమల్ల తండా గ్రామ పరిధిలోని లొద్ది తండాలో సోమవారం పాడి గేదె నెట్టడంతో గిరిజన మహిళ మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన మాలోతు లక్ష్మి (52) పాడి గేదెను తాడుతో పట్టుకొని మేత మేపేందుకు వెళ్తోంది. వెనక నుంచి గేదె నెట్టడంతో ఒక్కసారిగా కుప్పకూలింది. దీంతో పట్టుకున్న తాడు ఆమెకు చుటుకొని కింద పడింది. తలకు, మెడ నరాలకు గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందింది. మృతురాలికి భర్త రాజ్య, ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 2: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని బస్టాండు ప్రాంతంలో కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహదారిపై సోమవారం కారు, ఆటో ఢీకొన్న ఘటనలో నారాయణపూర్‌కు చెందిన ఆటో డ్రైవర్ నర్సయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. నర్సయ్య తన ఆటోను నడుపుకుంటూ బస్టాండు వైపునకు వెళ్తున్నాడు. గొల్లపల్లి నుంచి సిరిసిల్ల వైపునకు వస్తున్న కారు ఢీకొట్టింది. దీంతో నర్సయ్యకు గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని 108 వాహనంలో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పిచ్చికుక్క దాడిలో పలువురికి గాయాలు



గాయపడ్డ బాలుడు

కోనరావుపేట, సెప్టెంబర్ 2 : కోనరావుపేట మండలం కనగర్తి గ్రామంలో పిచ్చికుక్క దాడి చేయగా పలువురికి గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన బడే ధృవన్, ఓదెల రమ్య, మొకాళ్ల లచ్చిరెడ్డిలు కిరాణా షాపునకు వచ్చి ఇంటికి వెళుతుండగా పిచ్చికుక్క దాడి చేసి గాయపరిచింది. కాగా లింగంపల్లి రవికి చెందిన లేగ దూడపై పిచ్చికుక్క దాడి చేయగా గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ముగ్గురిని ఆసుపత్రికి తరలించారు.

తాటిపల్లి బాలికల గురుకులం ఖాళీ

● మూడు రోజుల పాటు విద్యార్థులకు సెలవు

● శిథిల భవనాలు.. భారీ వర్షాలే కారణం

మల్యాల, సెప్టెంబరు 2: మల్యాల మండలం తాటిపల్లి బాలికల గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థులను ఇంటికి పంపించారు. రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో ఇక్కడి విద్యార్థులకు సోమవారం నుంచి మూడు రోజుల పాటు సెలవు ప్రకటించారు. దాదాపు నలభై ఏళ్ల క్రితం ఎస్సారెస్పీ కెనాల్ తవ్వకం సందర్భంగా ఏర్పాటు చేసిన సిబ్బంది క్వార్టర్స్‌లో గురుకుల పాఠశాల ఏర్పాటు చేయగా అప్పటి నుంచి సగంకు పైగా ఆ భవనాలనే కొనసాగిస్తుండడం, మరి కొన్ని భవనాలు శిథిలవస్థకు చేరి కూలే దశకు చేరుకోవడంతో వర్షాలతో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా విద్యార్థులను ఇంటికి పంపించారు. ప్రస్తుతం పాఠశాలలో 475, కళాశాలలో 171 మంది విద్యనభ్యసిస్తున్నారు. 2018లో కళాశాల ఏర్పాటు చేసినప్పటికీ భవనాలు నిర్మించకపోవడం, పాత, శిథిల భవనాలలో తరగతులు నిర్వహించడం, చిల్లులు పడిన రేకుల గదులలోనే విద్యార్థులు పడుకోవడం తదితర అనేక సమస్యలను విద్యార్థులు ఎదుర్కొంటు న్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో విద్యార్థులు ఇబ్బందులు పడే పరిస్థితి ఉండడంతో ఆది, సోమవారాల్లో విద్యార్థులను ఇంటికి పంపించారు. ఈ విష యమై పాఠశాల, కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మానసను వివరణ కోరగా శిథిల, పాత భవనాలు సమస్యాత్మకంగా ఉన్న చోట్ల విద్యార్థులను ఇంటికి పంపించాలనే గురుకులాల సొసైటీ అధికారుల సూచన మేరకు విద్యార్థులకు మూడు రోజుల పాటు సెలవులు ప్రకటించి ఇంటికి పంపించినట్లు తెలిపారు



తాటిపల్లి బాలికల గురుకుల కళాశాల

ఏఐఎస్ఎఫ్ న్యాయ విద్య విభాగం రాష్ట్ర కన్వీనర్‌గా బాలసాని లెనిన్

పెద్దపల్లి రూరల్ , సెప్టెంబరు 2: మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన బాలసాని లెనిన్‌ను ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర న్యాయ విద్య విభాగం కన్వీనర్‌గా నియామకం అయ్యారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్ మాట్లాడుతూ తెలంగాణలో న్యాయ విద్య విద్యార్థుల కోసం ప్రత్యేకంగా లా వింగ్ ఏర్పాటు చేశామని ఈ వింగ్ రాష్ట్రంలోని న్యాయ విద్యార్థుల పక్షాన పోరాటాలు చేస్తుందన్నారు. తన నియామకానికి సహకరించిన ఏఐఎస్ఎఫ్ జాతీయ, రాష్ట్ర నాయకత్వానికి లెనిన్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

జ్వరంతో వ్యవసాయ కూలీ మృతి

ఓదెల, సెప్టెంబరు 2: మండలంలోని పొత్కపల్లికి చెందిన సిరిసేటి భాగ్యలక్ష్మి (60) అనే వ్యవసాయ కూలీ సోమవారం జ్వరంతో మృతి చెందింది. 15 రోజుల నుంచి జ్వరంతో ఉన్న భాగ్యలక్ష్మి విధిలేని పరిస్థితిలో ఆదివారం కూలిపనికి వెళ్లగా అక్కడ తీవ్ర అస్వస్థకు గురై కుప్ప కూలింది. ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు.

మహిళా సంఘాల ధర్నా

● రూ.12.5 లక్షలు స్వాహా చేసిన ఆర్‌పీపై చర్యలు తీసుకోవాలని డిమాండ్



కరీంనగర్‌లో నగర పాలక సంస్థ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న మహిళా సంఘాల సభ్యులు

కరీంనగర్ టౌన్, సెప్టెంబరు 2: మహిళా సంఘాల గ్రూపులకు చెందిన రూ.12.50 లక్షలను ఫోర్జరీ సంతకాలతో స్వాహా చేసిన ఆర్‌పీపై చర్యలు తీసుకోవాలని మహిళా సంఘాల సభ్యులు సోమవారం బల్దియా ఎదుట ధర్నా నిర్వహించారు. అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నాలో జిల్లా ప్రధాన కార్యదర్శి కోనేటి నాగమణి మాట్లాడుతూ మహిళా సంఘాల గ్రూపు డబ్బులను వాడుకున్న ఆర్‌పీపై చర్యలు తీసుకొని బాధిత మహిళలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. 11వ డివిజన్ కట్టరాంపూర్‌కు చెందిన గణేశ్ సమైఖ్య ఆధ్వర్యంలో దాదాపు 20 మహిళా స్వశక్తి గ్రూపులు ఉన్నాయన్నారు.

ఈ సమైఖ్యకు గాదం అరుణ ఆర్‌పీగా వ్యవహరిస్తున్నారన్నారు. బ్యాంకులో డబ్బులు వేస్తున్నాని చెప్పి 12 లక్షల 50వేల రూపాయలను స్వంతానికి ఆమె వాడుకున్నారని, గ్రూపు సభ్యులకు తెలియకుండా వారి సంతకాలను ఫోర్జరీ చేశారని ఆరోపించారు. వెంటనే ఆమె నుంచి ఆ డబ్బులను రికవరీ చేసి శాఖపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విచారణ జరిపి ఆర్‌పీపై చర్యలు తీసుకుంటామని అడిష నల్ కమిషనర్ సువార్త, మెప్మా పీఆర్‌పి అనిత హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా ఉపాధ్యక్షురాలు ద్యావ అన్నపూర్ణ, నాయకురాళ్ళు పి.దేవేంద్ర, సమైకర్య అధ్యక్ష, కార్యదర్శులు కుంటా సుప్రజ, చంద్రకళ, పూనా నవ్య, కోశాధికారి తాడెం శ్రీలత, వంగల జ్యోతి, సభ్యులు పాల్గొన్నారు.

వర్షం.. నష్టం

ఉమ్మడి జిల్లాలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో పలు చోట్ల నష్టం వాటిల్లింది. పెద్ద ఎత్తున వరద నీరు ప్రవహించడంతో రోడ్లు కోతకు గురయ్యాయి. పంటలు నీట మునుగడంతో రైతులు నష్టపోయారు. చెరువుల నిండి కట్టలు తెగిపోయి రోడ్లకు గండ్లు పడ్డాయి.



కథలాపూర్ మండలం ఇప్పపల్లి వద్ద తెగిపోయిన వేములవాడ-కోరుట్ల రహదారి



మెట్‌పల్లి మండలం మాసాయిపేట శివారులో ధ్వంసమైన రహదారి



ఎల్లారెడ్డిపేట మండలం దుమాలలో కోతకు గురైన పొలం



గోదావరిఖనిలో నీటిలో చిక్కుకున్న లారీ



జగిత్యాల రూరల్‌లో అనంతారం బ్రిడ్జిని పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



పెద్దపల్లిలో నీట మునిగిన పంట పొలాలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి

పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడిగా కర్రు సురేష్

పెద్దపల్లి, సెప్టెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ పెద్దపల్లి జిల్లాశాఖ కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఈ మేరకు ఆదివారం రాత్రి పెద్దపల్లిలో జరిగిన జిల్లా సర్వసభ్య సమావేశంలో అధ్యక్షుడిగా కర్రు సురేష్ నాలుగోసారి ఎన్నిక కాగా, ప్రధాన కార్యదర్శిగా గండు కృష్ణమూర్తి ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే అసోషియేట్ అధ్యక్షులుగా మేరుగు రాజమౌళి, గైని రమేష్, పచ్చిక స్వరూప, ఉపాధ్యక్షులుగా వెగోళపు సదానందం, పుల్లెల శ్రీధర్, దొమ్మాటి రవి, మారపెల్లి నాగరాజు, దేవి రమేష్, జన్ను కోమల, కార్యదర్శులుగా దుంపేటి రాజేశం, కనకం శ్రీనివాస్, జె శ్రీనివాస్, కొత్త శ్రీనివాస్, వొల్లాల సంజీవ్‌కుమార్, కె కనకతార ఎన్నికయ్యారు. అనంతరం వారు ప్రమాణ స్వీకారం చేశారు.

శిథిలావస్థలో ఉన్న ఇళ్లను ఖాళీ చేయాలి

పెద్దపల్లిటౌన్, సెప్టెంబరు 2: రెండు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో పట్టణంలోని శిథిలావస్థలో ఇళ్లలో నివాసమున్నవారు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ చైర్‌పర్సన్ దాసరి మమత రెడ్డి, కమిషనర్ ఆకుల వెంకటేష్ సూచించారు. ఈ సందర్భంగా పట్టణంలోని పలు వార్డుల్లో మున్సిపల్ అధికారులు శిథిలవస్థలో ఉన్న ఇళ్లను గుర్తించి వారికి నోటీసులు అందజేశారు. ఇళ్లను ఖాళీ చేయాలని సూచించారు. మున్సిపాల్టీ గుర్తించిన పునరావాస కేంద్రానికి తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో మేనేజర్ శివప్రసాద్ ,టౌన్ ప్లానింగ్ అధికారులు శ్రీహరి, వినయ్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా దుగ్యాల ప్రదీప్ జన్మదినం

అంతర్గాం/జూలపల్లి సెప్టెంబరు 2: రామగుండం పట్టణంలోని తబితా ఆశ్రమంలో సోమవారం బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్ జన్మదిన వేడుకలను రామగుండం బీజేపీ ఇన్‌చార్జి కందుల సంధ్యారాణిపోచం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్‌కట్ చేసి స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. జూలపల్లి మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షులు కొప్పుల మహేష్ ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు.

సంక్షిప్త సమాచారం..

ముత్తారం: మండలంలోని కేసనపల్లిలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చొప్పరి సదానందం అధ్వర్యంలో వైద్యాధికారి డాక్టర్ అమరేందర్‌రావు వైద్యశిబిరం నిర్వహించారు. ఈ క్యాంపులో 86 మందిని పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

కోల్‌సిటీటౌన్: గోదావరిఖని ప్రధానచౌరస్తా వన్ అడ్డా ఆటోడ్రైవర్స్ సంఘం నూతన కమిటీ సోమవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యింది. కమిటీ అధ్యక్షులుగా మారుపాక శ్రీనివాస్, ప్రధానకార్యదర్శిగా గోశిక చందర్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గడ్డం దేవేందర్, గౌరవ అధ్యక్షులుగా తానిప ర్తి గోపాల్‌రావు ఎన్నికయ్యారు.

- లయన్స్‌క్లబ్ ఆఫ్ గోదావరిఖని స్ఫూర్తి ఆధ్వర్యంలో రేకుర్తి కంటి ఆసుపత్రి వారి సౌజన్యంతో గోదావరిఖనిలోని ఆర్యవైశ్య భవన్‌లో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. 105 మందికి పరీక్షలు నిర్వహించారు. రీజనల్ చైర్‌పర్సన్ వేల్పూరి సంపత్‌రావు, డిస్ట్రిక్ హైబాల్ చైర్‌పర్సన్ మోదంపూరి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పెద్దపల్లి రూరల్: నెల రోజులుగా గ్రామాల్లోని ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యులు అధికారుల దాడుల వల్ల వైద్యం చేయడంలేదని వెంటనే వారిపై దాడులు నిలిపివేసి గ్రామీణ ప్రజలకు వైద్యం అందించాలని డిమాండ్ చేస్తూ సోమవారం మండలంలోని బొంపల్లి వద్ద పెద్దపల్లి-జగిత్యాల రహదారిపై గ్రామస్థులు రాస్తారోకో చేపట్టారు. ఈసం దర్భంగా సుమారు గంట పాటు రహదారిపై బైఠాయించి నినాదాలు చేయడంతో ఇరువైపులా ట్రాఫిక్ జాం అయింది. మాజీసర్పంచ్ కడారి కొమురయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఓదెల: మండలంలోని జీలకుంటలో ఆదివారం రాత్రి కురిసిన వర్షంతో పిడుగుపాటుకు పింగిలి రాజేందర్ రెడ్డి అనే రైతుకు చెందిన ఎద్దు మృతి చెందింది. ఇంటి బయట ఉన్న చెట్ల కింద ఎడ్లను కట్టేసి ఉంచగా సమీపంలో పిడుగుపడడంతో అక్కడే ఉన్న ఎద్దు మృతి చెందిందని, దీంతో లక్ష రూపాయల మేరకు నష్టం వాటిల్లిందని రైతు ఆవేదన వ్యక్తం చేశారు.

ముత్తారం: ఆర్ఎంపీ, పీఎంపీలపై రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందని బీఆర్ఎస్ ముత్తారం మండల అధ్యక్షుడు పోతిపెద్ది కిషన్ రెడ్డి ఒక ప్రకటనలో ఆరోపించారు. గ్రామీణ వైద్య వృత్తిని అణిచివేయాలన్న ధోరణితో రాష్ట్ర ప్రభుత్వం దాడులు చేయిస్తూ ఆర్ఎంపీ, పీఎంపీలను భయభ్రాంతులకు గురి చేస్తుందని ఆరోపించారు.

- రైతు రుణమాఫీ కానీ రైతుల కోసం ప్రభుత్వం ఫ్యామిలీ గ్రూప్ ఇన్సూరెన్స్ తప్పనిసరిగా చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి అనూష కోరారు. పెండింగ్ లిస్టులో ఉన్న పేర్లు ఫ్యామిలీ గ్రూప్ ఇన్ ఫొటో వ్యవసాయ అధికారి ఆధ్వర్యంలో దిగాలని కోరారు.

- ముత్తారం మండలంలోని మానేరు శివారు ప్రాంతాలైన ఖమ్మంపల్లి, ఓడేడు, ముత్తారం, పారుపల్లి గ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు చొప్పరి సదానందం సూచించారు.

గోదావరిలో కొట్టుకుపోయిన విద్యుత్ మోటార్లు

జనగామ రైతులకు రూ.30లక్షల వరకు నష్టం

కోల్‌సిటీ, సెప్టెంబరు 2: ఎల్లంపల్లి ప్రాజెక్టు గేట్లను శనివారం రాత్రి ఎత్తడంతో రామగుండం మన్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని జనగామ గ్రామ రైతులకు చెందిన విద్యుత్ మోటార్లు, పైపులు నది ప్రవాహంలో కొట్టుకుపోయాయి. గోదావరిలో ప్రవాహం తక్కువగా ఉండడంతో రైతులు గోదావరిలో 300 మీటర్ల లోపల విద్యుత్ మోటార్లు పెట్టి పైప్‌లైన్ల ద్వారా పొలాలకు నీటి సరఫరా చేసుకుంటున్నారు. వరద ప్రవాహంతో మోటార్లు కొట్టుకుపోయాయి. 35మంది రైతుల మోటార్లు, పైప్‌లైన్లు నదిలో కొట్టుకుపోయినట్టు రైతులు పేర్కొంటున్నారు. కొన్ని పైపులను ఆదివారం సాయంత్రం ఒడ్డుకు చేర్చామని, సోమవారం వరద ఎక్కువగా రావడంతో ఉన్న పైపులు కూడా కొట్టుకుపోయాయన్నారు. గతంలో ప్రాజెక్టు గేట్లు ఎత్తే సమయంలో రైతులకు సమాచారం ఇచ్చేవారని, చాటింపు చేసేవారన్నారు. ఈసారి అకస్మాత్తుగా గేట్లు ఎత్తడంతో తాము తీవ్రంగా నష్టపోయామని రైతులు ఆరోపిస్తున్నారు. తమను ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

సుల్తానాబాద్: వరుసగా కురుస్తున్న వర్షాలతో శిథిలావస్థకు చేరిన పలు ఇళ్లు కూలిపోయాయి. ఈ మేరకు సోమవారం పలు గ్రామాల్లో అధికారలుఉ పర్యటించి వివరాలు సేకిరిం చినట్లు మండల ప్రత్యేకాధికారి జగన్మోహన్‌రెడ్డి తెలిపారు. ఎంపీడీవో దివ్య దర్శన్‌రావుతో కలసి పలు గ్రామాల్లో పర్యటించారు. కొదురుపాకలో మూడు ఇళ్లు శిథిలావస్థకు చేరికూలిపోగా వారందరినీ సురక్షిత ప్రాంతాలకు తరలించి వారికి బస ఏర్పాటు చేశామన్నారు. రేగడిమద్దికుంటలో పలు నివాస గృహాలలోకి వరద నీరు చేరాయన్నారు. గొల్లపల్లి, నారాయణరావుపల్లి , గట్టేపల్లి తదితర గ్రామాల్లో పలు ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయని వివరించారు.



పొంగి పొర్లుతున్న కుక్కలగూడూర్ బండలవాగు

జూలపల్లి: మండలంలో వాగులు, ఒర్రెలు ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తున్నాయి. జూలపల్లి, వడుకాపూర్ గ్రామాల మధ్య హసేమిని యావాగు బ్రిడ్జి, రోడ్యాంలపై ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వడుకాపూర్‌లోని శివచెరువు ఒర్రె ప్రమాదస్థాయిలో ప్రవహిస్తుండడంతో ఆవలివైపున ఉన్న ఎరుకల కులస్తులు ఒర్రె నీటి ప్రవాహా న్ని దాటలేక అవస్థలు ఎదుర్కొంటున్నారు. వెంకట్రావుపల్లి గ్రామ శివారులోని ప్రధాన రోడ్డు మార్గంలో గల రోడ్యాంలపై వరదనీరు ప్రవహిస్తుండడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వడుకాపూర్ గ్రామంలోని పడుబడ్డ బావులు, లోతట్టు ప్రాంతాలు వర్షం నీటితో నిండిపోవడంతో డ్రైనేజి వ్యవస్థ సరిగాలేక నీరు నిలిచిపోయింది.

పెద్దపల్లి రూరల్: మండలంలోని పెద్దబొంకూరు గ్రామపంచాయతీ అనుబంధ దస్తగిరిపల్లి- కొత్తపల్లి గ్రామాల మధ్య ఉన్న లో లెవెల్ బ్రిడ్జి పై నుంచి వరదనీరు అధికంగా ప్రవహిస్తుండటంతో అధికారులు దారిని మూసివేశారు. మూలసాల గ్రామం మీదుగా ప్రవహించే హుస్సేన్‌మియా వాగు నిండుకుండలా ప్రవహిస్తోంది. రాగినేడు- బ్రాహ్మణపల్లి గ్రామాల మధ్య బ్రిడ్జిపై నీరు ప్రవహిస్తుండటంతో మత్స్యకారులు చేపలను పట్టేపనిలో పడ్డారు. వీటితో పాటు అప్పన్నపేట, బొంపల్లి , రాఘవపూర్, రంగాపూర్, సబ్బితం, హన్మంతునిపేట గ్రామాల చెరువులు నిండి మత్తడి పారుతున్నాయి.

పాలకుర్తి: మండల వ్యాప్తంగా వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. కుక్కలగూడూర్, గుడిపెల్లి, ఈసాలతక్కళ్లపల్లి తదితర గ్రామాల్లోని చెరువులు మత్తళ్లు దూకాయి. బండలవాగుతో పాటు పలు గ్రామాల్లోని వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. అన్ని శాఖల ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజలను అప్రమత్తం చేశారు. పలుచోట్ల వర్షపు నీరు రహదారులపై చేరడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

చీరే శ్రీరామ రక్ష



కల్వర్టు వద్ద చీరను ఏర్పాటు చేసిన అధికారులు

పెద్దపల్లి రూరల్, సెప్టెంబరు 2: మండలంలో ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలతో వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. కొత్తపల్లి సమీపంలో గల కల్వర్టు పైనుంచి వరదనీరు ప్రవహిస్తుండటంతో ఎవరు దాటలేని పరిస్థితి ఉంది. ఈ నేపథ్యంలో ప్రమాదాలు జరగకుండా ముందస్తుగా చర్యగా అధికారులు చీరను రోడ్డుకు అడ్డంగా కట్టి హెచ్చరికలు ఏర్పాటు చేశారు.

ఎస్సీ, ఎస్టీ కోర్టు పీపీగా అరెల్లి రాములు



ఓదెల, సెప్టెంబరు 2: కరీంనగర్ ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక కోర్టు ఇన్‌చార్జి అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్(పీపీ)గా పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం కనగర్తి గ్రామానికి చెందిన అరెల్లి రాములు సోమవారం నియమితులయ్యారు. ఇప్పటికే కరీంనగర్ జిల్లా రెండవ అదనపు కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా కూడా అరెల్లి రాములు కొనసాగుతున్నారు. అరెల్లి రాములు నియామకంపై కనగర్తి గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

కాంగ్రెస్ కల్లబొల్లి మాటలు నమ్మే కాలం పోయింది

గోదావరిఖని, సెప్టెంబరు 2: కాంగ్రెస్ కల్లబొల్లి మాటలు ప్రజలు నమ్మే కాలం పోయిందని, దేశ అభ్యున్నతి కోసం పాటుపడే పార్టీ బీజేపీ అని బీజేపీ ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్ కుమార్ అన్నారు. సోమవారం స్థానిక కళ్యాణ్‌నగర్‌లోని రాజస్థాన్ భవన్‌లో నగర సభ్యత్వ నమోదు కార్యశాల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో 14 రాష్ట్రాల్లో ఒక్క సీటు కూడా గెలవని కాంగ్రెస్ పార్టీకి బీజేపీని విమర్శించే నైతిక హక్కు ఎక్కడిదని ప్రశ్నించారు. బీజేపీ రెండు పార్లమెంటు సీట్ల నుంచి మొదలు కొని అత్యంత ఆత్మవిశ్వాసంతో పనిచేసి ఈ రోజు వరుసగా మూడుసార్లు దేశంలో అధికారం చేపట్టిందన్నారు. కార్యకర్తలు కూడా లక్ష్యాన్ని నిర్ధేశించుకుని పనిచేసినట్లయితే తప్పకుండా విజయం సాధిస్తారన్నారు. అనంతరం నియోజకవర్గ ఇన్‌చార్జి కందుల సంధ్యరాణి మాట్లాడుతూ ప్రజా సమస్యల మీద కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేసి నట్లయితే రాబోయే రోజులలో తెలంగాణలో పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో జిల్లా సభ్యత్వ ప్రముఖ్ క్యాతం వెంకట రమణ, మండల అధ్యక్షులు కోడూరి రమేష్, గుండబోయిన భూమయ్య, గోపగాని నవీన్‌గౌడ్, శివరాం, పిడుగు కృష్ణ, రాజ్‌కుమార్, బూడిద రమేష్, దాసరి ఉషా, పతంజలి పాల్గొన్నారు.

మాజీ సీఎం వైఎస్సార్‌కు ఘన నివాళి



గోదావరిఖనిలో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

సుల్తానాబాద్/మంథని/ముత్తారం/రామగిరి/యైటింక్లయిన్‌కాలనీ/మార్కండేయకాలనీ, సెప్టెంబరు 2: దివంగత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి(వైఎస్సాఆర్) వర్ధంతి సందర్భంగా జిల్లాలోని పలు మం డలాల్లో ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడారు. ఆరోగ్యశ్రీ, 108, 104 అంబులెన్స్‌లు, ఉచిత విద్య, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఇందిరమ్మ ఇండ్లు, ఎల్లంపల్లి ప్రాజెక్టులను ప్రజలకు సమకూర్చార న్నారు. రామగుండంలో సింగరేణి స్థలాల్లో 18వేల కట్టడాలకు పట్టాలు ఇప్పించారన్నారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఎస్సారెస్పీకి జలకళ


- వానాకాలం, యాసంగి పంటలకు భరోసా
- హర్షం వ్యక్తం చేస్తున్నరైతులు
- పైనుంచి పెద్ద ఎత్తున వస్తున్న వరద నీరు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఉత్తర తెలంగాణ జిల్లాల రైతంగానికి వరద ప్రదాయిని అయిన శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి పెద్దఎత్తున వరద నీరు వచ్చి జలకళను సంతరించుకున్నది. దీంతో వానాకాలం, యాసంగి పంటలకు సాగు నీటికి ఢోకా లేకుండా పోవడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సీజన్‌లో ఎస్సారెస్పీ ఎగువ ప్రాంతంలో వర్షాలు కురియడం ఆలస్యం కావడంతో ప్రాజెక్టు నిండుతుందా, లేదా అని రైతులు ఆందోళనకు గురయ్యారు. ఒక్కో బొట్టు, ఒక్కో బొట్టు వచ్చి చేరుతుండడంతో ఒకింత రైతుల్లో ఆశలు చిగురించారు. మహారాష్ట్రలోని బాలెగావ్, విష్ణుపురి ప్రాజెక్టులు ఆరు రోజుల క్రితం నిండడంతో అదనంగా వచ్చే నీటిని గేట్ల ద్వారా వదిలి పెట్టడంతో కాస్త ప్రవాహం పెరిగింది. శని, ఆదివారాల్లో కురిసిన వర్షాలతో క్రమంగా ప్రాజెక్టులోకి వరద ప్రవాహం పెరిగింది.

సోమవారం సాయంత్రం వరకు 2,51,250 క్యూసెక్కుల వరద నీరు ప్రాజెక్టులోకి వస్తుండగా, 2,50,000 క్యూసెక్కుల నీటిని 42 గేట్లు ఎత్తి గోదావరిలోకి వదిలి పెడుతున్నారు. కాకతీయ కాలువకు ఐదు వేల క్యూసెక్కుల నీళ్లు, వరద కాలువకు ఏడు వేల క్యూసెక్కుల నీటిని వదిలి పెడుతున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 80.5 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 72.99 టీఎంసీల నీళ్లు ఉన్నాయి. అధికారులు వరద ప్రవాహాన్ని బట్టి నీటిని వదులుతున్నారు. ఎస్సారెస్పీపై మిడ్ మానేరు, ఎల్ఎండీ ప్రాజెక్టులు ఆధారపడి ఉన్నాయి. మిడ్ మానేరు ఆదివారం వరకు శ్రీపాద ఎల్లంపల్లి నుంచి నీటిని ఎత్తిపోశారు. ఎస్సారెస్పీ నిండడంతో సోమవారం ఉదయం నుంచి ఎత్తిపోతలను నిలిపి వేశారు. మిడ్ మానేరు నుంచి అన్నపూర్ణ రిజర్వాయర్‌కు తరలిస్తున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టు నీటి మట్టం 19.55 టీఎంసీలు ఉండగా, ఇంకా ఎనిమిది టీఎంసీల నీళ్లు చేరాల్సి ఉంది. ఎల్ఎండీలోకి 9,500 క్యూసెక్కుల వరద నీరు వస్తుండడంతో 15.584 టీఎంసీలకు నీటిమట్టం చేరుకున్నది. పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరాలంటే 8.50 టీఎంసీల నీళ్లు అవసరం, మిడ్ మానేరు, ఎల్ఎండీలకు ఎస్సారెస్పీ నుంచి తరలించనున్నారు.

ఎస్సారెస్పీలో తగినంత నీరు లేకపోవడంతో ఇప్పటివరకు పెద్దపల్లి, జగిత్యాల, కరీంనగర్ జిల్లాల్లోని 4.5 లక్షల ఎకరాల ఆయకట్టు భూములకు ఆన్‌అండ్‌ఆఫ్ పద్ధతిలో ఆగస్టు 7వ తేదీ నుంచే నీటిని వదులుతున్నారు. ఎల్ఎండీ దిగువన గల 4 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీటిని విడుదల చేయడం లేదు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో ఎల్ఎండీ పరిధిలో ఉండే ఆయకట్టు భూములకు కూడా నీటిని సరఫరా చేయనున్నారు. ఈ నెలలో మరికొన్ని రోజులు వర్షాలు కురిసే అవకాశాలు ఉండడంతో వారం, పది రోజుల్లో మిడ్ మానేరు, ఎల్ఎండీలు కూడా పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకోనున్నాయి. ఈ వానాకాలం పంటలతో పాటు యాసంగి పంటలకు కూడా సాగు నీటికి ఢోకా లేకుండా పోతుండడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు అవసరం లేకుండానే జిల్లాలోని శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టుకు నుంచి సుమారు 20 టీఎంసీల నీటిని మోటార్ల ద్వారా మిడ్ మానేరులోకి ఎత్తి పోశారు. మొత్తం మీద సాగు నీటి కోసం ఆందోళన చెందిన అన్నదాత మోములో ఆనందం వెల్లివిరుస్తున్నద.



35 శాతం లాభాల వాటా ప్రకటించాలి



డీజీఎంకు వినతిపత్రం ఇస్తున్న టీబీజీకేఎస్ నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ, సెప్టెంబరు 2: 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 35శాతం లాభాల వాటా కార్మికులకు చెల్లించాలని టీబీజీకేఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం ఆర్జీ-2 ఏరియాలోని డిపార్ట్‌మెంట్లు అధికారులకు వినతిపత్రాలను అందజేశారు. ఏరియా వర్క్‌షాప్‌లో డీజీఎంకు వినతిపత్రం ఇచ్చిన అనంతరం ఏరియా వైస్ ప్రెసిడెంట్ అయిలి శ్రీనివాస్ మాట్లాడారు. గడిచిన ఆర్థిక సంవత్సరంలో కార్మికులు శ్రమించి నిర్ధేశిత లక్ష్యం 70 మిలియన్ టన్నుల ఉత్పత్తి సాధించినట్టు తెలిపారు. ఐదు నెలలు గడుస్తున్నందున పన్నులు చెల్లింక కన్నా ముందు నికర లాభాలను ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాదాసు రామ్మూర్తి, ప్రభాకరోరెడ్డి, ఐ సత్యం, బేతి చంద్రయ్య, మామిడి తిరుపతి, సురేందర్, రవితేజ, దాసరి శ్రీనివాస్, వెంకటేష్, రాములు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఆర్జీ-3 పరిధిలోని ఓసీపీ-1 ప్రాజెక్టులోని వివిధ సెక్షన్‌లలో 35 శాతం లాభాల కార్మికులకు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం టీబీజీకేఎస్ నాయకులు సంబంధిత అధికారులకు వినతిపత్రాలను అందజేశారు. ఈకార్యక్రమాల్లో పిట్ సెక్రెటరీ పింగిలి సంపత్‌రెడ్డి, నాయకులు అల్లం తిరుపతి, సత్యానారాయణ, పోతరాజు, రవి, కుమార్, వెంకటయ్య, బాబూరావు, సాయికుమార్, రవీందర్‌రెడ్డి, రాజేశం పాల్గొన్నారు.

ఆర్జీ-1 ఏరియా 79 శాతం బొగ్గు ఉత్పత్తి

గోదావరిఖని, సెప్టెంబరు 2: ఆర్‌జీ-1 ఏరియాలో ఆగస్టు మాసం ఉత్పత్తి లక్ష్యాలకు వర్షాలు బ్రేక్ వేశాయి. 3,65,700టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యానికి గాను 2,90,647టన్నుల ఉత్పత్తి సాధించినట్టు జీఎం పేర్కొన్నారు. నిర్దేశించిన లక్ష్యంలో 79శాతం సాధించామన్నారు. అధిక వర్షాల వల్లే ఉత్పత్తికి అంతరాయం ఏర్పడినట్టు జీఎం లలిత్ కుమార్ తెలిపారు. సోమవారం ఆయన ఉత్పత్తి వివరాలపై ప్రకటన విడుదల చేశారు. ఆగస్టు నాటికి డివిజన్‌లో 19.75లక్షల టన్నులకు గాను 17లక్షల టన్నుల ఉత్పత్తి జరిగిందన్నారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పర్యటన సందర్భంగా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, అంతర్గత రోడ్ల పనులకు సంబంధించి శిలా ఫలకాలు ఆవిష్కరించారన్నారు. మేడిపల్లి ఓసీపీలో 500మెగావాట్ల పంప్‌డ్ స్టోరేజీ పవర్ ప్లాంట్ నిర్మాణ ప్రతిపాదనలపై స్థల పరిశీలన చేశారన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ: గడిచిన ఆగస్టు నెలలో ఆర్జీ-2 ఏరియాలో 92 శాతం బొగ్గు ఉత్పత్తి జరిగినట్టు జీఎం సూర్యనారాయణ పేర్కొన్నారు. సోమవారం జీఎం కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఉత్పత్తి వివరాలను జీఎం తెలియజేశారు. ఏరియాకు 4,78,400 టన్నుల లక్ష్యాన్ని నిర్ధేశించగా 4,40,010 టన్నుల బొగ్గు ఉత్పత్తి (92శాతం) జరిగినట్టు జీఎం తెలిపారు. ఓవర్‌బర్డెన్ తొలగింపు లక్ష్యం 42,84,000 క్యూబిక్ మీటర్లు కాగా 27,15,747 క్యూబిక్ మీటర్ల(63శాతం) వెలికితీసినట్టు జీఎం సూర్యనారాయణ పేర్కొన్నారు. అధిక వర్షాల కారణంగా ఓబీ వెలికితీతలో లక్ష్యాన్ని చేరుకోలేకపోయామని అన్నారు. ఆగస్టు నెలలో ఏరియా నుండి 4,93,029 టన్నుల బొగ్గు రవాణా జరిగినట్టు జీఎం పేర్కొన్నారు. సమావేశంలో పీఓ మధుసూదన్, అఫీషియేటింగ్ జీఎం సంతోష్‌కుమార్, అధికారులు పాల్గొన్నారు.

రామగిరి: ఆగస్టు మాసంతంలో ఆర్జీ-3 డివిజన్‌కు నిర్ధేశించిన 4.19లక్షల టన్నుల లక్ష్యానికి గాను 4.15 లక్షల టన్నులబొగ్గు ఉత్పత్తి(99శాతం) సాధించామని ఆర్జీ-3, ఏపీఏ జీఎంలు సుధాకర్‌రావు, వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. నిర్ధేశించిన 38.30 లక్షల క్యూబిక్ మీటర్ల ఓబీ లక్ష్యానికి గాను 26.42 శాతంతో 69 శాతంలో నిలిచిందన్నారు. ఏపిఏ డివిజన్ పరిధీలోని అడ్రియాల లాంగ్‌వాల్ ప్రాజెక్టుకు నిర్ధేశించిన 0.17 లక్షల టన్నుల లక్ష్యానికి గాను 0.11 లక్షల టన్నులు సాధించి 63 శాతంలో నిలిచిందన్నారు.

సింగరేణి ఆసుపత్రిని తనిఖీ చేసిన జీఎం

గోదావరిఖని, సెప్టెంబరు 2: ఆర్‌జీ-1 జీఎం లలిత్‌కుమార్ సోమవారం ఏరియా ఆసుపత్రిని ఆకస్మిక తనిఖీ చేశారు. ఆసుపత్రిలో వివిధ వార్డుల్లో పేషెంట్ల వద్దకు వెళ్లి ఆరోగ్య పరిస్థితి గురించి, వైద్య వివరాల గురించి వాకబు చేశారు. క్యాంటీన్‌లో కుకింగ్ సెక్షన్‌ను పరిశీలించారు. టిఫిన్, మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించారు. ఆహార పదార్థాలను తిని నాణ్యత పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట డీవైసీఎంఓ కిరణ్‌రాజ్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.

గోదావరి వరద ప్రవాహం పరిశీలన..

కోల్‌సిటీ: గోదావరి ప్రవాహం పెరగడం, గోదావరి తీరాన మేడిపల్లి ఓపెన్‌కాస్టు, జీడీకే1ఇంక్లైన్ ఉండడం, ఇన్‌టేక్‌వెల్ నుంచి నీటి సరఫరా జరుగనున్న దృష్ట్యా ఆర్‌జీ-1 జీఎం లలిత్‌కుమార్ పంప్‌హౌస్‌ను పరిశీలించారు. జీడీకే 2ఏ, 5ఇంక్లై న్ మోరిల వద్దకు వెళ్లి అక్కడున్న చెత్తను తొలగించాలన్నారు. ఎస్ఓటూజీఎం రాంమోహన్, ఇంజనీర్ వెంకటేశ్వర్‌రావు, డీవైఎస్ఈ వరప్రసాద్, ఏరియా సేఫ్టీ అధికారి బైద్య ఉన్నారు.

ఫ్రంట్‌లైన్ సూపర్ వైజర్లకు శిక్షణ తరగతులు

యైటింక్లయిన్‌కాలనీ, సెప్టెంబరు 2: ఫ్రంట్ లైన్ సూపర్‌వైజర్లకు స్ట్రక్చర్ ట్రైనింగ్ ప్రోగ్రాం శిక్షణా తరగతులను సోమవారం ఎంవీటీసీ శిక్షణా కేంద్రంలో ఆర్జీ-2 జీఎం సూర్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడారు. గనులలో ప్రమాదాలు జరగకుండా రక్షణ సూత్రాలు పాటిస్తూ సేఫ్టీ మేనేజ్‌మెంట్ ప్లాన్ అమలు చేస్తూ రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తి సాధించడంలో ఫ్రంట్‌లైన్ సూపర్ వైజర్ల పాత్ర కీలకమని అన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా మైనింగ్ విభాగంలో వస్తున్న ఆధునిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని, నైపుణ్యతను పెంచుకునేందుకు ఈశిక్షణ దోహదం చేస్తుందన్నారు. ప్రమాదాల నివారణకు ఎస్ఓపీ, ఎస్ఎంపీ లను తప్పనిసరిగా అమలు చేయాలని జీఎం సూచించారు. ఆర్జీ రీజియన్ సేఫ్టీ జీఎం కేహెచ్‌ఎన్ గుప్తా, అఫీషియేటింగ్ ఎస్వోటూ జీఎం, ఆర్జీ-2 సేఫ్టీ ఆఫీసర్ సంతోష్‌కుమార్, ఎంవీటీసీ మేనేజర్ మురళీకృష్ణ, ఎంప్లీ డీజీఎం హుస్సైనీ, ఎస్ఎస్ఓ షరీఫ్ మహమ్మద్, ఇన్‌స్ట్రక్టర్లు నాగెల్లి సాంబయ్య, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

పెద్దపల్లిటౌన్, సెప్టెంబరు 2: గర్భిణుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రభుత్వ ఆసుపత్రులలో అత్యధికంగా సురక్షిత ప్రసవాలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కోయ శ్రీ హర్ష సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో గర్భిణులకు వైద్య సేవలపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. గర్భిణులకు జిల్లాలో ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా అద్భుతంగా సేవలందించిన వైద్యులను కలెక్టర్ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలను వినియోగించుకుని గర్భిణుల రిజిస్ట్రేషన్ వంద శాతం పూర్తి చేయాలన్నారు. జిల్లా కేంద్రంలోని పెద్దపల్లి మాతా శిశు సంరక్షణ ఆరోగ్య కేంద్రం, మంథనిలోని ఎంసిహెచ్, గోదావరిఖనిలోని జనరల్ ఆసుపత్రి, సుల్తానాబాద్ ఆసుపత్రిలలో అత్యధిక ప్రసవాలు సురక్షితంగా జరిగేలా చూడాలన్నారు. సమావేశంలో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ ప్రమోద్ కుమార్, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్, ప్రోగ్రాం అధికారి డాక్టర్ వాణిశ్రీ పాల్గొన్నారు

మున్సిపల్ సిబ్బందికి రెయిన్‌కోట్స్ పంపిణీ

సుల్తానాబాద్, సెప్టెంబర్ 2: సుల్తానాబాద్ మున్సిపల్ కార్యాలయంలో సోమవారం సిబ్బందికి చైర్‌పర్సన్ గాజల లక్ష్మి రాజమల్లు రెయిన్‌కోట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ పట్టణంలోని పలు లోతట్లు ప్రాంతాలు జలమయం అయ్యాయని వాటిని తమ సిబ్బంది వెంట వెంటనే క్లియర్ చేస్తున్నారని అన్నారు. మూసుకుపోయిన డ్రైనేజీలను కూడా పూడికలు తీసి వరద నీరు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకుంటున్నారని అన్నారు. పట్టణంలో ఎలాంటి సమస్య ఉన్నా వెంటనే తమను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ శోభా శంకర్, మేనేజర్ అలీమొద్దీన్ పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్ల సంఘం జిల్లా అధ్యక్షుడిగా విజయ్‌కుమార్

పెద్దపల్లిటౌన్, సెప్టెంబరు 2: ఫొటో, వీడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా పోగుల విజయ్ కుమార్ ఎన్నికయ్యారు. ఆదివారం రాత్రి స్థానిక నందన గార్డెన్లో జరిగిన ఎన్నికలలో రెడ్డి భాస్కర్ ప్యానల్‌పై పోగుల విజయ్ కుమార్ ప్యానల్ 42 ఓట్లతో తేడాతో విజయం సాధించారు. జిల్లా అధ్యక్షులుగా పోగుల విజయ్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎండి ఇర్ఫాన్, కోశాధికారిగా అల్లం సతీష్‌లు ఎన్నికైనట్లు ఎన్నిక అధికారులు ప్రకటించారు. కార్యక్రమంలో ఎన్నికల అధికారులు, తెలంగాణ రాష్ట్ర ఫొటో, వీడియో గ్రాఫర్స్ సంక్షేమ సంఘం గౌరవ సలహాదారులు మహిమల కేదార్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి రాము, లగిశెట్టి చంద్రమౌళి, పల్లెర్ల ఉదయ్, కుర్మ రమేష్‌బాబు, తాతరాజు, శ్రీనివాస్,రెడ్డి భాస్కర్, వనపర్తి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఘనంగా పొలాల అమావాస్య

మంథని, సెప్టెంబరు 2: పొలాల అమావాస్య వేడుకలను మంథని ప్రాంతంలో ప్రజలు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని బ్రాహ్మణులతో పాటు పలువురు తమ ఇండ్లలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం అమ్మవారికి పొలాల అమావాస్య వ్రతాన్ని ఆచరించారు. రైతులు తమ పశువులను అందంగా అలంకరించారు.

కరాటేలో ఖని విద్యార్థుల ప్రతిభ

కోల్‌సిటీటౌన్, సెప్టెంబరు 2: సికింద్రాబాద్‌లో జరిగిన జాతీయస్థాయి కరాటే పోటీల్లో గోదావరిఖనికి చెందిన ఒకినావా మార్ష్ ఆర్ట్ అకాడమీ రెడ్‌డ్రాగన్ కరాటే ఇన్స్టిట్యూట్ విద్యార్థులు ప్రతిభ కనపర్చారు. రైల్వే నిలయం ఇండోర్ స్టేడియంలో ఆదివారం జరిగిన ఈ పోటీల్లో కటా, కుమితే విభాగాల్లో జె.అకుర్ష్, జీ.వీనస్, జి.శాన్వి, ఎం.హంసిని, డి.వికీ, పి.సహస్ర, జె.జస్వంత్, ఎ.సుశాంత్, ఎం.రాహుల్, ఎఎస్‌కే అఫ్స్, పి.చైతన్య, వి.రుత్విక్, టి.సాత్విక్, కె.ఆశాసేత్, పి.ధనుష్, కె.మాల్యాతేజ, కె.విష్ణువర్ధన్‌లు బంగారు, వెండి, కాంస్య పతకాలను సాధించారు. పతకాలు సాధించిన విద్యార్థులను రెడ్ డ్రాగన్ కరాటే ఇన్స్టిట్యూట్ డ్యూటీ గ్రాండ్ మాస్టర్ షిహాన్ కె.మొండయ్య, సీనియర్ కోచ్ సెన్సాయ్ క్రాంతికుమార్ అభినందించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

పెద్దపల్లి టౌన్, సెప్టెంబరు 2: పట్టణంలో సోమవారం ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని 117 మంది లబ్ధిదారులకు మూడు కోట్ల 5లక్షల రూపాయల విలువ చేసే చెక్కులను లబ్ధి దారులకు అందజేశారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. ఎన్నికల హామీలను విడతలవారీగా అమలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

బొంపల్లిలో ఒకరికి డెంగ్యూ పాజిటివ్

పెద్దపల్లి రూరల్, సెప్టెంబరు 2: మండలంలోని బొంపల్లి గ్రామానికి చెందిన ఒకరికి డెంగ్యూ పాజిటివ్‌గా నిర్ధారణ అయినట్లు వైద్యులు తెలిపారు. డెంగీ వచ్చిన వారి ఇంటి చుట్టూ బ్లీచింగ్ చేయించడంతో పాటు, తగు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచించారు.

ఉచిత వైద్య శిబిరం

పెద్దపల్లి రూరల్, సెప్టెంబరు 2: మండలంలోని బొంపల్లిలో రాగినేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా పలువురికి ఎంఎల్‌హెచ్‌పి రవళి వైద్య పరీక్షలు నిర్వహించి మాత్రలను పంపిణీ చేశారు. శిబిరంలో పంచాయతీ కార్యదర్శి సంపత్,గ్రామ పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

నియామకం

కాల్వశ్రీరాంపూర్, సెప్టెంబరు 2: యూఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం పెద్దపల్లి జిల్లా కార్యదర్శిగా రామగల్ల సురేష్‌ను నియమించినట్లు ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి మాదం తిరుపతి తెలిపారు. ఈ సందర్భంగా రామగల్ల సురేష్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉన్న విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో ముందుంటామన్నారు. నాపై నమ్మకం ఉంచి జిల్లా కార్యదర్శిగా నియమించిన యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీకి, రాష్ట్ర కార్యదర్శికి మాదం తిరుపతికి కృతజ్ఞతలు తెలియజేశారు.

రైతులు అయోమయానికి గురికావొద్దు

ఓదెల, సెప్టెంబరు 2: రుణమాఫీ విషయంలో రైతులు అయోమయానికి గురి కావద్దని ఏడీఏ శ్రీనాథ్ తెలిపారు. సోమవారం మండలంలోని గుంపుల రైతు వేదికలో నిర్వహిస్తున్న రైతు వివరాల నమోదును శ్రీనాథ్ పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ రుణమాఫీ వర్తించని రైతులు వ్యవసాయశాఖ సిబ్బంది తెలిపిన విధంగా అన్ని వివరాలు అందజేయాలని కోరారు. కార్యక్రమంలో ఏవో భాస్కర్, ఏఈవోలు కిరణ్, అనిల్, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ



సిబ్బందికి సూచనలిస్తున్న వైద్యాధికారులు

ముత్తారం, సెప్టెంబరు 2: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా అడిషనల్ డిఎం డాక్టర్ ప్రసన్న, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ కిరణ్, జిల్లా మదర్ అండ్ చైల్డ్ హెల్త్ కేర్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ వాణిశ్రీతో కలిసి సోమవారం తనిఖీ చేశారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి అమరెందర్‌రావుకు సూచించారు. వారంలో రెండు రోజులు డ్రైడే పాటించాలన్నారు. జ్వరాలు ప్రబలకుండా ఇంటింటి సర్వే చేయాలని సూచించారు.